క్లుప్తంగా

సైక్లింగ్‌తో ఆరోగ్య, పర్యావరణ పరిరక్షణ



సైక్లోథాన్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సైక్లింగ్‌తో ఆరోగ్య పరిరక్షణతో పాటు పర్యావరణ పరిరక్షణ కూడా సాధించవచ్చని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. స్టేట్ లెవెల్ ఖేలో ఇండియా సెంటర్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం స్థానిక అల్లూరి సీతారామరాజు స్టేడియం వద్ద నుంచి స్థానిక జ్యూట్‌మిల్ వద్ద ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహం వరకూ 3 కిలో మీటర్ల సైక్లోథాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే చంటి ప్రారంభించారు. కార్యక్రమంలో వెయిట్ లిఫ్టింగ్ సమాఖ్య ఉపాధ్యక్షుడు బడేటి వెంకట రామయ్య, నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం



బాలుడికి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు ప్రశాంతి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అసోసియేషన్ భవనంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. విజయవాడ కు చెందిన ప్రముఖ నేత్ర వైద్య సంస్థ ×మాక్స్ విజన్‌డాక్టర్ల బృందం రోగులకు ఉచితంగా నేత్ర పరీక్షలు చేసి సూచనలు సలహాలు ఇచ్చారు. అవసరమైన వారికి విజయవాడలోని తమ ఆసుపత్రిలో శస్త్ర చికిత్సలు చేసేందుకు వైద్యులు సంసిద్ధత వ్యక్తం చేశారు. అందుకు అవసరమైన వివరాలను రోగులకు వివరించారు. దాదాపు 50 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు దున్నా వెంకటేశ్వరరావు, కార్యదర్శి ఎస్ఎస్ఆర్ సత్యనారాయణ, గౌరవ అధ్యక్షుడు గొర్ల రామారావు, కోశాధికారి ప్రగళ్లపాటి రామ్మోహన్ రావు, డాక్టర్ శివరామకృష్ణ పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే

దెందులూరు: కుష్ఠు వ్యాధితోపాటు సంక్రమిత వ్యాధుల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని పోతునూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ అన్నారు. ఆదివారం పోతునూరు పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో ఇంటింటా ఏఎన్ఎంలు, ఆశా సిబ్బంది కుష్ఠు వ్యాధి, సంక్రమిత వ్యాధుల లక్షణాలపై సర్వే నిర్వహించారు. రంగులేని స్పర్శలేని మచ్చల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సంక్రమిత వ్యాధుల లక్షణాలు, తీసుకోవాల్సిన వైద్య చికిత్సపై ఏఎన్ఎంలు అవగాహన కల్పించారు. సర్వేను డాక్టర్ ప్రవీణ్ కుమార్ ఎంపీహెచ్ఓ హరి పరిశీలించారు.

బర్డ్‌ఫ్లూ భయంతో చికెన్ షాపులు వెలవెల

- ఇంకా పుంజుకోని చికెన్ వ్యాపారం
- వేట మాంసం, చేపలు, రొయ్యల కొనుగోలుకు మొగ్గు



వెలవెలబోతున్న చికెన్ షాపు



చేపలు శుభ్రం చేసే ప్రాంతంలో నెలకొన్న రద్దీ

ఏలూరు (టూటౌన్): మాంసాహార ప్రియులకు చికెన్ అంటే ఎంతో ఇష్టం. అయితే నెల రోజుల కిందట ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో బర్డ్‌ఫ్లూ కలకలం రేగడంతో ప్రజలు చికెన్ తినేందుకు భయపడుతున్నారు. దీంతో చికెన్ వ్యాపారం వెలవెలబోతుంది. చికెన్ స్థానంలో ప్రజలు మటన్, చేపలు, రొయ్యలు వంటివి తినేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఏలూరులోని చేపల మార్కెట్ ఆదివారం కళకళలాడింది. ఇదే సమయంలో పక్కనే ఉన్న చికెన్ దుకాణంలో చికెన్ కొనేవారు లేక వెలవెలబోతూ కనిపించింది.ఓ పక్క చికెన్ తినడం వల్ల ఎటువంటి ప్రమాదం రాదని, ఆరోగ్యానికి ఎటువంటి హాని కలుగుదని పౌల్ట్రీల నిర్వాహకులు, చికెన్ వ్యాపారులు చికెన్ మేళాలు సైతం పెట్టి నగరంలో అవగాహన కల్పించే కార్యక్రమాన్ని చేపట్టారు. పలు రకాల చికెన్ వంటకాలను వండి ఉచితంగా ప్రజలకు అందజేశారు. అంత వరకు బాగానే ఉన్నా సంబంధిత అధికారులు ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించడంలో విఫలమయ్యారనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. చికెన్ తో పాటు కోడిగుడ్లను తినేందుకు ప్రజలు పెద్దగా ఆసక్తి చూపించడం లేదు. ప్రజల్లో ఉన్న భయం పౌల్ట్రీ యజమానులను, చికెన్ వ్యాపారులను నిట్టనిలువుగా ముంచేసిందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తం అవుతుంది.

ధరలు తగ్గినా అమ్మకాలు అంతంత మాత్రమే

కారణం ఏదైనప్పటికీ చికెన్ ధరలు గణనీయంగా తగ్గిపోయాయి. గతంలో కిలో చికెన్ రూ.200 నుండి రూ.220 వరకు ఉండేది. ఒక్కో సమయంలో ఈ ధర మరింత ఎక్కువగా ఉండేది. ప్రస్తుతం కిలో చికెన్ ధర రూ.150నుంచి రూ.180 వరకు ఉంది. అదే హోల్‌సేల్ ధర అయితే మరింత తక్కువకు దొరుకుతుంది. బర్డ్‌ఫ్లూ కలకలం రాకముందు రోజుకు వంద కోళ్లు అమ్మే వారు ప్రస్తుతం 20 కోళ్లు కూడా అమ్మలేకపోతున్నామని వాపోతున్నారు. మరి కొద్ది రోజులు ఇదే పరిస్థితి నెలకొనే ప్రమాదం ఉందని చెబుతున్నారు. ఏలూరు నగరంలో దాదాపు 250కు పైగా చికెన్ రిటైల్ షాపులు, 40 వరకు హోల్ సేల్ దుకాణాలు ఉన్నాయి. వీటికి అదనంగా పౌల్ట్రీల నుంచి నేరుగా తీసుకువచ్చి అమ్మకం సాగించే వారు కొందరు ఉన్నారు. సగటున ఒక్క ఆదివారమే ఏలూరు నగరంలో సుమారు 10 టన్నుల వరకు చికెన్ అమ్మకాలు సాగేవి. ప్రస్తుతం చికెన్ అమ్మకం 5 టన్నులు కూడా జరగడం లేదని చికెన్ హోల్ సేల్ దుకాణదారులు చెబుతున్నారు.

చికెన్‌కు తగ్గిన ప్రాధాన్యత

బర్డ్‌ఫ్లూ పుణ్యమా అంటూ మాంసహారప్రియులు అత్యధికంగా ఇష్టపడే చికెన్‌కు దూరమవుతున్నారు. దీని స్థానంలో మటన్, చేపలు, రొయ్యలు వంటి వాటిపై ఆసక్తి కనబరుస్తున్నారు. దీంతో మార్కెట్‌లో వీటి కొనుగోళ్లు పెరగడంతో పాటు ధరలు సైతం పైపైకి పోతున్నాయి. బర్డ్‌ఫ్లూ కు ముందు కిలో మటన్ రూ.700 నుండి రూ.800 ఉండేది. తాజాగా కిలో మటన్ ధర రూ.800 నుంచి రూ.1000 వరకు అమ్ముతున్నారు. అదేవిధంగా చేపలు (తెల్లవి) కిలో రూ.180 నుంచి రూ.200 ధర పలికేవి. ప్రస్తుతం వీటి ధర కిలో రూ.220 నుండి రూ.240 వరకు పలుకుతుంది.

కొద్దిరోజులు చికెన్ మానేశాం



బర్డ్‌ఫ్లూ కారణంగా కొద్దిరోజులు చికెన్ తినడం మానేద్దామని నిర్ణయించుకున్నాం. మా ఇంట్లో అందరం చికెన్‌ను ఎంతో ఇష్టంగా తినే వాళ్లం. ప్రస్తుతం దాని స్థానంలో ఒక సారి మటన్, మరోసారి చేపలు లేదా రొయ్యలు తినేందుకు ప్రాధాన్యత ఇస్తున్నాం. చివరకు పిల్లలు ఎంతో ఇష్టంగాతినే కోడిగుడ్లు తిందామన్నా భయంగానే ఉంది.

– బొల్లారపు నాగరాజు, బాప్టిస్ట్‌పేట, ఏలూరు

చికెన్ తినడం వల్ల ప్రమాదం లేదు



బాగా ఉడికించిన చికెన్ తినడం వల్ల ఎటువంటి ప్రమాదం లేదు. దీని వల్ల జబ్బులు కూడా రావు. అయినా ప్రజల్లో ఉన్న అపోహల వల్ల చికెన్, గుడ్లు తినడం తగ్గించిన మాట వాస్తవమే. ఇది గమనించే ఎక్కడికక్కడ చికెన్ మేళాలను నిర్వహించాం. ప్రజలు తమలో ఉన్న భయాందోళనలను విడనాడి ఎప్పటిలాగానే చికెన్ తినేందుకు ముందుకు రావాలి.

– టి.గోవిందరాజు, జేడీ, పశుసంవర్ధక శాఖ, ఏలూరు జిల్లా

మహిళలు ముందడుగు వేయాలి



వివిధ రంగాల్లో సేవలందించిన మహిళలను సత్కరిస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సమాజంలో మహిళలపై రాజకీయ, ఆర్థిక, సామాజిక అణిచివేతలను వివక్షతను అంతం చేయాలనే డిమాండ్లతో మహిళా దినోత్సవం ప్రారంభమైందని రిటైర్డ్ ప్రధానోపాధ్యాయురాలు పి.కస్తూరి బాయి తెలిపారు. ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం, హేలాపురి బాలోత్సవం సంయుక్త ఆధ్వర్యంలో శనివారం రాత్రి స్థానిక రామకృష్ణాపురం సాహిత్య మండలి హాలులో మహిళా సాంస్కృతిక సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా కస్తూరిబాయి మాట్లాడుతూ మహిళల కోసం మహిళలే ముందడుగు వేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో సత్తాచాటిన మహిళలను సత్కరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ అసోసియేట్ ప్రొఫెసర్ ఎం.ఎస్తేరు కల్యాణి, ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్ డీఎస్ఎస్ చంద్రావతి, హేలాపురి బాలోత్సవం కమిటీ ప్రతినిధి ఆలపాటి నాగేశ్వరరావు, ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, నిర్వాహక కమిటీ సభ్యురాలు జి.నీలిమ, ఎం. సుకన్య తదితరులు పాల్గొన్నారు.

నేడు హిందువులపై దాడి, అక్రమ కేసులకు వ్యతిరేకంగా నిరసన

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : హిందువులపై జరుగుతున్న దాడులు, అక్రమ కేసులకు వ్యతిరేకంగా సోమవారం ఏలూరు కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు హిందూ సంఘాల ఐక్యకార్యాచరణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రామనపూడి శివప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలో ఈ నెల 4న గ్రామస్తులు నిర్వహిస్తున్న పారేటి గ్రామ ఉత్సాహం (ఊరేగింపు) సందర్భంగా ముస్లింలు ఆకారణంగా హిందువులపై రాళ్లురువ్వడం దారుణని మండిపడ్డారు. ఈ సంఘటనలో పోలీసులు హిందువులపై లాఠీచార్జి చేయడం అన్యాయని పేర్కొన్నారు. దాడి చేసిన వారిపై కాకుండా హిందువులపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ, రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలక్టర్ కార్యాలయల వద్ద నిరసనలు చేస్తున్నామని స్పష్టం చేశారు. సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో హిందువులు పాల్గొనాలని కోరారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలి



ఏలూరు నియోజవర్గ ఇన్‌చార్జి జయప్రకాష్‌తో వాణిజ్య విభాగం సెక్రెటరీ బాచీ

ఏలూరు (టూటౌన్) : వైఎస్సార్ సీపీలో వివిధ విభాగాల్లో పదవులు పొందిన వారంతా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఏలూరు ఇన్‌చార్జి మామిళ్లపల్లి జయప్రకాష్(జేపీ) పిలుపునిచ్చారు. ఆదివారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం సెక్రటరీగా నియమితులైన బాస్కర్ల ఆర్ఎస్ శంకర్ (బాచి) ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి మామిళ్లపల్లి జయప్రకాష్ (జేపీ)ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జేపీని శాలువాతో సత్కరించి తనను పార్టీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఏలూరు జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు నెరుసు చిరంజీవి, జిల్లా విద్యార్థి విభాగ అధ్యక్షుడు పాతినవలస రాజేష్, మహిళ నాయకురాలు తులసి వర్మ తదితరులు పాల్గొన్నారు.

శ్యామల హరికోటికి నారీరత్న పురస్కారం



శ్యామల హరికోటికి పురస్కారం ప్రదానం చేస్తున్న శ్రీశ్రీ కళావేదిక ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : శ్రీశ్రీ కళావేదిక ఏలూరు జిల్లా మహిళా అధ్యక్షురాలు, నగరానికి చెందిన శ్యామల హరికోటికి నారీరత్న అవార్డు లభించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం విజయవాడ గాంధీ నగర్ ఆశిష్ ఫంక్షన్ హాల్లో శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో తెలుగు సాహిత్య, సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాలతో జాతీయస్థాయిలో సేవలు చేస్తున్న మహిళలను నారీరత్న పురస్కారాలతో సత్కరించారు. దీనిలో భాగంగా శ్రీశ్రీ కళావేదిక ద్వారా ఏలూరు జిల్లాలో సాహిత్య సేవలు అందిస్తున్న శ్యాల హరికోటికి ఉమన్ ఎక్సలెన్సీ అవార్డు–2025ను ప్రదానం చేసి శాలువా, జ్ఞాపిక, ప్రశంసా పత్రంతో శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ ఛైర్మన్ కత్తిమండ ప్రతాప్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శ్రీశ్రీకళావేదిక జాతీయ సమన్వయకర్త కొల్లి రమావతి, జాతీయ అధ్యక్షురాలు జి.ఈశ్వరీ భూషణం. ప్రధాన కార్యదర్శి టి.పార్థ సారథి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కాళికా విజయం నృత్య రూపకం



కాళికా విజయం నృత్య రూపకంలోని సన్నివేశం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సకల కళాకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, నగరానికి చెందిన దువ్వి రామారావు కళారంగ ప్రవేశ 60 వసంతాల వేడుకల్లో భాగంగా ప్రదర్శించిన కాళికా విజయం నృత్య నాటిక ప్రేక్షకులను విశేషంగా అలరించింది. స్థానిక వైఎంహెచ్ఏ హాలులో ఆదివారం రాత్రి నగరానికి చెందిన అభినయ నృత్య భారతి సంస్థ, సకల కళాకారుల సంక్షేమ సంఘ, నాగపూర్‌కు చెందిన అఖిల భారత తెలుగు సేన, హైదరాబాద్‌కు చెందిన నృత్య దర్పణ సంస్థలతో పాటు పలు సాంస్కృతిక, స్వచ్ఛంద సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. సురభి సెట్టింగులతో హైదరాబాద్‌కు చెందిన పలువురు నృత్య కళాకారులు ప్రదర్శించిన ఈ నృత్య రూపకంలో అమ్మవారిగా ఎం. ధార్మిక వెంకట్, శివునిగా రూపేష్ చంద్ర, రక్తబీజునిగా డి.హేమ సుందర్, నారదునిగా గణేష్ హరి హరతో పాటు పలువురు నృత్య కళాకారులు వివిధ పాత్రలతో నృత్య రూపకాన్ని రక్తికట్టించారు. ఈ నృత్య రూపకానికి రింద ప్రశాంతి దర్శకత్వం వ్యవహరి ంచగా రిత్విక్ వెంకట్ నృత్య దర్శకునిగా వ్యవహరించారు. అనంతరం కళారంగ ప్రవేశం చేసి 60 వసంతాలు పూర్తి చేసుకున్న దువ్వి రామారావును ఘనంగా సన్మానించారు.

ఆయుర్వేద వైద్యంతో అన్ని వ్యాధులూ దూరం



ఆయుర్వేద వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు నగేష్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆయుర్వేద వైద్య విధానంలో అన్ని రకాల వ్యాధులనూ నయం చేయవచ్చని ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణుడు డాక్టర్ నగేష్ తెలిపారు. ఆదివారం స్థానిక రామకోటి ప్రాంగణంలో లయన్స్ క్లబ్ ప్రతినిధి మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో ఆయుర్వేద వైద్యుడు డాక్టర్ నగేష్ బృందం ద్వారా ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతిలో లభించే స్వచ్ఛమైన ఆకులు, వేళ్ళు ఇతర పదార్థాలతో తయారు చేసిన మందులను ఆయుర్వేద వైద్యంలో అందిస్తామని, దీనితో ఎలాంటి సైడ్ ఎఫెక్స్ ఉండదన్నారు. వంటింటిలో దొరికే అనేక దినుసులతో వివిధ వ్యాధులకు, అనారోగ్యాలకు విముక్తి లభిస్తుందని వివరించారు. ఈ సందర్భంగా 112 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమున్న అందరికీ ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రోగులకు బొలిశెట్టి సురేష్, పిల్లి పండరీనాథ్, పి.విఠల్ సేవలు అందించారు.

బస్సుల కోసం నిరీక్షణ

భీమడోలు: భీమడోలు జాతర ఉత్సవానికి జిల్లాతో పాటు పొరుగు జిల్లాల నుంచి వచ్చిన భక్తులు ఆదివారం తిరిగి తమ స్వగ్రామాలకు వెళ్లేందుకు బస్సుల కోసం పడిగాపులు పడ్డారు. గంటల కొద్దీ ఎండలో నిలబడి బస్సుల కోసం ఎదురు చూసినా బస్సులు రాక పోవడంతో ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారు. మహా జాతర జరుగుతున్న వేళ.. కనీసం ఆర్టీసీ యాజమాన్యం బస్సు సర్వీసులు పెంచకపోవడంతో వారంతా యాజమాన్యం తీరును బాహాటంగానే విమర్శిస్తున్నారు.

మద్యం దుకాణాల వద్ద రద్దీ

భీమడోలు జంక్షన్‌లోని జాతీయ రహదారికి ఇరువైపులా బ్రాందీ షాపులు, మాంసపు దుకాణాలు, బిర్యానీ పాయింట్లు ఉండడంతో ఆ ప్రాంతమంతా జనంతో నిండిపోయింది. మద్యం దుకాణాల వద్ద బైక్‌లు ఎక్కువగా నిలిచిపోవడంతో రద్దీ ఏర్పడింది. దీనితో మందు బాబులను తప్పించుకుని వెళ్లేందుకు జనం ఇబ్బందులు పడ్డారు. జాతర కావడంతో మద్యం విక్రయాలు జోరుగా సాగాయి.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	16	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	30	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	40	బీళ్ల చిక్కుడు	88
వంకాయలు (తెలుపు)	34	చామదుంపలు	44-48
బెండకాయలు	40	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	24	కంద	72
కాకర కాయలు	36	బీట్‌రూట్	30
బీరకాయలు (పందిరి)	44	కీరా దోస	40
కాలీఫ్లవర్	--	ఫ్రెంచ్‌బీన్స్	60
క్యాబేజీ	16	అల్లం	60
క్యారెట్	30	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	40	పాలకూర	10
బంగాళదుంపలు	26	చుక్కకూర	10
ఉల్లిపాయలు	40	తోటకూర	10
గోరుచిక్కుడు	44	గోంగూర	07-10
దోసకాయలు	30	పుదీనా	05
అనబకాయ (1)	20	క్యాప్సికమ్	52
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	40

బాధిత కుటుంబ సభ్యులకు చెక్కు అందజేత



బాధితులకు చెక్కు అందజేస్తున్న సూపరింటెండెంట్

దెందులూరు: స్థానిక పోస్టాఫీస్‌లో రూ.10 లక్షల చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు పోస్టల్ జిల్లా సూపరింటెండెంట్ శ్రీకర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది అక్టోబర్ 9న ఫ్రిజ్‌లో బాటిల్ తీసుకుంటుండగా విద్యుత్ షాక్‌తో మరియమ్మ మృతి చెందిందని తెలిపారు. ఆమె పోస్టల్‌లో రూ.396తో ప్రీమియం తీసుకోవడం వలన ఆమె మరణానంతరం కుటుంబ సభ్యులకు రూ.10 లక్షల చెక్ మంజూరైనట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏలూరు పోస్టల్ ఐపీఓ దెందులూరు పోస్టుమాస్టర్ వెంకట్ సురేష్ పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

పెదపాడు: మండలంలోని తోటగూడెం గ్రామంలో పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఎస్సై కట్టా శారద సతీష్ తెలిపారు. ఈ దాడిలో నలుగురు జూదరులను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.4600 స్వాధీనం చేసుకున్నామన్నారు.

నేటి నుంచి దీవెన పండుగలు

దెందులూరు: కొవ్వలిలోని కొత్తపేటలో ఈనెల 10, 11, 12 తేదీల్లో బేతేలు సువార్త సహవాసం సంఘం ఆధ్వర్యంలో దీవెన పండుగలు నిర్వహిస్తున్నట్లు సంఘ సభ్యులు తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి నలుగురు సువార్తికులు వాక్య పరిచర్య కోసం విచ్చేస్తారని సమీప గ్రామాల్లోని విశ్వాసులు కొవ్వలి దీవెన పండుగకు హాజరుకావాలని కోరారు.

వైభవంగా భీమేశ్వరస్వామి కల్యాణం

నిడమర్రు: పెదనింద్రకొలను గ్రామంలోని స్వయంభూ శ్రీపార్వతీ సమేత భీమేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. కూనపురాజు సోమరాజు దంపతులతో స్వామి వారి కల్యాణాన్ని పండితులు కైతేపల్లి బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వహించారు. సోమవారం స్వామి వారి రథోత్సవం అనంతరం నాని ఆర్కెస్ట్రా సినీ మ్యూజికల్ నైట్, 11న చింతామణి నాటక ప్రదర్శనలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

పేదోడి ఫ్రిజ్‌కు భలే గిరాకీ



విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న మట్టి కుండలు

పెదవేగి : అప్పుడే ఎండలు భగభగ మండుతున్నాయి... గొంతులు తడారుతున్నాయి... ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు ముఖ్యంగా చల్లటి నీటి కోసం ప్రజలు పరుగులు తీస్తున్నారు. ఈ క్రమంలో పేదొడి ఫ్రిజ్ (కుండ)కు డిమాండ్ పెరిగింది. ఆరోగ్యానికి కూడా ఎంతో మంచిదన్న భావనతో మట్టి కుండలను కొనుగోలు చేసేందుకు ప్రజలు అసక్తి చూపుతున్నారు. మండలంలోని కూచింపూడి, వేగివాడ, విజయరాయి, భోగాపురం, పెదవేగి, కొప్పాక, తదితర ప్రాంతాల్లో కుండలు విక్రయిస్తున్నారు. కుండ సైజును బట్టి రూ 80 రూపాయల నుంచి 160 వరకు విక్రయిస్తున్నారు.

ఎల్‌ఐసీ ఏజెంట్ల సమస్యలు పరిష్కరించాలి



ఎంపీ పుట్టా మహేష్ యాదవ్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎల్ఐసీ ఏజెంట్లు

పెదపాడు: ఎల్ఐసీ ఏజెంట్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ యాదవ్‌కు ఏలూరు జిల్లా ఎల్ఐసీ ఏజంట్ల యూనియన్ నాయకులు వినతిపత్రాన్ని సమర్పించారు. ఎల్ఐసీ యాజమాన్యం తీసుకుంటున్న కొన్ని నిర్ణయాల కారణంగా దేశ వ్యాప్తంగా ఉన్న 13లక్షలకు పైగా ఉన్న ఏజెంట్ల మనుగడకే ముప్పు వాటిల్లిందని, ప్రైవేటు సంస్థల ప్రభావంతో ఎల్ఐసీ ఎన్నడూ లేనంతటి తీవ్ర సంక్షోభానికి గురవుతోందని ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. పాలసీ హోల్డర్స్‌కి ఏయేటికాయేడు బోనస్ తగ్గించి వేస్తుంటం ఏజంట్ల కమీషన్ శాతం గణనీయంగా తగ్గించడం బ్యాంకుల్లో ప్రజల నుంచి బలవంతంగా పాలసీలు కట్టించడం లాంటి ఎన్నో ఏజంట్ల వ్యతిరేక నిర్ణయాలు అమలు చేస్తున్న కారణంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఎల్ఐసీ వ్యాపారం అనూహ్యంగా పడిపోయిందని ఎంపీకి వివరించారు. వినతిపత్రం అందించిన వారిలో ఏలూరు ఎల్ఐసీ ఏజంట్స్ యూనియన్ అధ్యక్షుడు వడ్డి త్రివేణి కుమార్ కార్యదర్శి ఎస్ శ్రీనివాసరావు, కోశాధికారి ఎంవీఎస్ రాజు, సుంకర హరనాథ్, వివి శివరామకృష్ణ, మందపాటి వెంకటేశ్వరావు, సతీష్, పీఎస్ భాస్కర్, బీవీ వీ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	27
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం (ఇంద్ర)	20.15	35
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	16
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	35

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	20
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	23
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	21
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	19
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	22
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	23
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	25
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	18
ఏలూరు - తిరుపతి	16.0	4830	34